TGTEL/25/A0977

# తొవ్వ

స్వాగతం

సామాన్యుని ఆవేదనకు అక్షర రూపమే నా తొవ్వకు స్ఫూర్తి

సంపుటి : 1 | సంచిక : 70 | గురువారం 6-11-2025 | ఎడిటర్ : ముఖేష్ వీరంటి | పేజీలు: 5 | వెల : 5 రూ/.

## నడిరోడ్డుపై కత్తిపోట్లు

**యువకుడిపై కత్తితో పాశవిక దాడి**

**బాధితుడు, నిందితుడు ఇద్దరూ రౌడీషీటర్లే**

**హైదరాబాద్‌లోని జగద్గిరిగుట్టలో ఘటన**

**జీడిమెట్ల, నవంబరు 5:** రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ఓ రౌడీషీటర్ బరి తెగించాడు. బుధవారం సాయంత్రం నాలుగు గంటలప్పుడు, నడిరోడ్డుపై అందరూ చూస్తుండగానే తన ప్రత్యర్థి అయిన మరో రౌడీషీటర్‌పై కత్తితో పాశవికంగా దాడి చేశాడు. పాత కక్షల నేపథ్యంలో విచక్షణారహితంగా పొడిచి హత్యాయత్నం చేశాడు. బాధితుడు రక్తమోడుతూ ప్రాణభయంతో పరుగులు తీయగా.. తమ కళ్ల ముందు జరిగిన రక్తపాతాన్ని చూసి జనమంతా భీతిల్లిపోయారు. హైదరాబాద్‌లోని జగద్గిరిగుట్టలో బుధవారం సాయంత్రం జరిగిన ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది.

## ఎక్సైజ్ శాఖకు.. ఒక్క నెలలోనే భారీగా ఆదాయం..

### ఒక్క నెలలోనే రూ.6,348 కోట్ల ఆదాయం

**హైదరాబాద్, నవంబరు 5:** రాష్ట్ర ఎక్సైజ్ శాఖకు ఒక్క నెలలోనే భారీగా ఆదాయం సమకూరింది. ఏకంగా రూ.6,348 కోట్లు ప్రభుత్వ ఖజానాలో జమ అయ్యాయి. కొత్త మద్యం పాలసీలో భాగంగా అందిన దరఖాస్తుల ఫీజులు, లైసెన్స్ ఫీజుల రూపంలో ఏకంగా రూ.3,180 కోట్లకుపైగా ఆదాయం వచ్చింది. అక్టోబరు నెలలో వరుస పండుగలు రావడంతో మద్యం అమ్మకాల ద్వారా రికార్డు స్థాయిలో రూ.3,168 కోట్ల ఆదాయం సమకూరింది. గతంలో ఎన్నడూ లేని విధంగా రెట్టింపు స్థాయిలో ఆదాయం రావడం ఎక్సైజ్ శాఖ అధికారులను సైతం ఆశ్చర్యానికి గురిచేసింది. రాష్ట్రంలోని 2,620 మద్యం దుకాణాలకు రెండేళ్ల కాలపరిమితికి కొత్త లైసెన్సులు ఇచ్చేందుకు ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించిన విషయం తెలిసిందే. కొత్త పాలసీలో మద్యం దుకాణాల దరఖాస్తు ఫీజును రూ.2లక్షల నుంచి రూ.3లక్షలకు పెంచింది. రెండేళ్ల క్రితం 1.32లక్షల మంది దరఖాస్తు చేయగా.. రూ.2,645 కోట్ల ఆదాయం సమకూరింది. ఈ సారి దరఖాస్తు ఫీజు పెంచినప్పటికీ మద్యం దుకాణాలను దక్కించుకోవడానికి 95,628 మంది పోటీపడ్డారు. ఫలితంగా కేవలం దరఖాస్తుల విక్రయం ద్వారానే ఎక్సైజ్ శాఖకు రూ.2,868.8 కోట్ల ఆదాయం వచ్చింది.

కాంగ్రెస్‌కు హిందువులు

## ఇజ్జత్ కాదా?

### కిషన్ రెడ్డి



**బోరబండ, నవంబరు 5 :** జూబ్లీహిల్స్ భవిష్యత్తును నిర్దేశించే ఈ ఉప ఎన్నికలో ప్రజలు తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఇప్పటి వరకూ జూబ్లీహిల్స్ నుంచి కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు గెలిచినా అభివృద్ధి చేయలేదని.. ఈసారి బిజేపీకి అవకాశం ఇవ్వాలని ఆయన ఓటర్లను కోరారు. బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారంలో భాగంగా బోరబండ, ఎర్రగడ్డ డివిజన్‌లలో బుధవారం సాయంత్రం నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. కేసీఆర్ హయాంలో మజ్లిస్ ఏ రకంగా వ్యవహరించిందో అందరికీ తెలుసని.. కాంగ్రెస్ అభ్యర్థి ఒక్కప్పటి మజ్లిస్ నాయకుడేనని, ఆయన గతంలో ఎంఐఎం నుంచి పోటీ చేశారని, మజ్లిస్ నుంచి కాంగ్రెస్ అరువు తెచ్చుకుని టికెట్ ఇచ్చిందని గుర్తుచేశారు. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి హోదాలో ఉండి.. "కాంగ్రెస్ పార్టీ ముస్లింల ఇజ్జత్" అనడమేమిటంటూ సీఎం రేవంత్‌పై కిషన్‌రెడ్డి మండిపడ్డారు. "కాంగ్రెస్ పార్టీకి హిందువులు ఇజ్జత్ కాదా?" అని కిషన్ రెడ్డి నిలదీశారు. మజ్లిస్ పార్టీని రేవంత్ రెడ్డి భుజాల మీద వేసుకొని తిరుగుతున్నారని ధ్వజమెత్తారు. "'మీకు మేయర్... మాకు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే' అని మజ్లిసతో కాంగ్రెస్ ఒప్పందం కుదుర్చుకుంది." అని ఆరోపించారు. దేశంపైన కొంచెం కూడా అభిమానం లేకుండా రేవంత్ రెడ్డి సైనికులను కించపరుస్తూ మాట్లాడడం ఎంతవరకూ సమంజసం అని ప్రశ్నించారు. కేసీఆర్ ఫాంహౌసకు పోయినట్లు... రేవంత్ రెడ్డి సైతం ఫాంహౌసకు వెళ్లాల్సిందేనని, ప్రజలు మార్పు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రజలు కోరుకుంటున్న మార్పు బీజేపీతోనే వస్తుందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు.




# ఆ పార్టీలు ముస్లింల రిజర్వేషన్‌ను ఎత్తేస్తాయ్

## బీజేపీ, బీఆర్ఎస్ కలిసే ప్రయత్నం చేస్తున్నాయి

**- హిందూ, ముస్లిం.. కాంగ్రెస్‌కు రెండు కళ్లు - క్రైస్తవ సంఘాల సమావేశంలో ముఖ్యమంత్రి**

**హైదరాబాద్, నవంబరు 5 :** కాంగ్రెస్‌కు హిందూ, ముస్లిం మతాలు రెండూ.. రెండు కళ్ల లాంటివని, తాము దేనినీ తక్కువ చేయబోమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్‌ను వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించిందని గుర్తు చేశారు. అయితే బీఆర్ఎస్, బీజేపీ ఆ రిజర్వేషన్‌ను ఎత్తేయాలని చూస్తున్నాయని ఆరోపించారు. ముస్లింల రిజర్వేషన్‌ను 12 శాతానికి పెంచుతామన్న కేసీఆర్.. పదేళ్లలో ఎందుకు పెంచలేదని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా బుధవారం రాత్రి కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌తో కలిసి షేక్‌పేట డివిజన్‌లోని పారామౌంట్ కాలనీ గేట్-3 నుంచి గేట్-2, గేట్-1 మీదుగా బృందావన్ కాలనీ వరకు, యూసుఫ గూడలో వెంకటగిరి నుంచి కృష్ణానగర్ మీదు గా యూసఫ్‌గూడ చెక్ పోస్టు వరకు సీఎం రేవంత్ రెడ్డి రోడ్‌షో నిర్వహిం చారు.ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో కార్నర్ మీటింగ్‌లలో మాట్లాడారు. "కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతికి సంబంధించి కేసీఆర్‌పై సీబీఐ కేసెందుకు పెట్టలేదని సవాల్ విసిరితే.. కిషన్‌రెడ్డి నాకు సవాల్ విసరుతున్నారు. నాతో చర్చలు జరపడం కాదు.. ఢిల్లీకి వెళ్లి మోదీ, అమిత్‌షాతో చర్చించండి. కేసీఆర్, కేటీఆర్ అరెస్టుకు ఎందుకు అనుమతించడంలేదని కొట్లాడండి" అని రేవంత్ ధ్వజమెత్తారు.

## కేటీఆర్.. పేదల కడుపు నింపడం మాకు గొప్పే

- ప్రతి పేదవాడికి 6 కిలోల సన్నబియ్యం ఇస్తున్నాం
- జూబ్లీ హిల్స్‌లో కొత్తగా 14 వేల రేషన్ కార్డులిచ్చాం
- మంత్రి వాకిటి శ్రీహరి



**హైదరాబాద్, నవంబరు 5:** పేదల కడుపు నింపడం తమకు గొప్ప విషయమేనని మంత్రి వాకిటి శ్రీహరి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఉద్దేశించి అన్నారు. కొత్తగా రేషన్ కార్డులతో పాటు ప్రతి పేదవాడికి ఆరు కిలోల చొప్పున సన్న బియ్యం ఇస్తున్నామని చెప్పారు. పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో ఒక్క రేషన్ కార్డు కూడా మంజూరు చేయలేదని విమర్శించారు. పేద ప్రజల కడుపు నింపడం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న రేషన్ కార్డులు చూసి... వారు చేయనిది తాము చేస్తున్నామని ఓర్వలేక అహంకార ధోరణితో కేటీఆర్ అడ్డగోలుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బుధవారం వెంగళరావు నగర్ డివిజన్ జవహర్ నగర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా దళిత ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, అడ్లూరి లక్ష్మణ్ కూడా పాల్గొన్నారు. శ్రీహరి మాట్లాడుతూ అంబేద్కర్ ఇచ్చిన వజ్రాయుధం ఓటు హక్కు అని, ఈ ప్రాంత ప్రజల అభివృద్ధి గురించి ఆలోచించే వారికి ఓటేస్తేనే రాజ్యాంగం ద్వారా ఆయన కల్పించిన ఓటు హక్కుకు విలువ ఉంటుందన్నారు. జూబ్లీ హిల్స్ నియోజకవర్గంలో మూడుసార్లు బీఆర్ఎసకు అధికారం ఇచ్చిన తరువాత కూడా ఇంకా ఈ ప్రాంతంలో మురికి కాలువలు, హై టెన్షన్ వైర్లు, తాగునీటి సమస్యలు ఎందుకున్నాయో ప్రజలు ఆలోచించాలన్నారు.



### హరియాణాలోనూ

# ఓట్ చోరీ..

**25 లక్షల నకిలీ ఓట్లతో బీజేపీ మా గెలుపును దొంగిలించింది**

**'ఆపరేషన్ సర్కార్ చోరీ'లో మోదీ,**

**అమిత్ షాలతో సీఈసీ, ఇద్దరు ఎన్నికల కమిషనర్లు కుమ్మక్కయ్యారు**

**ఓటరు జాబితాలో బ్రెజిల్ మోడల్ ఫొటోతో 22 ఓట్లు**

**ఒక నియోజకవర్గంలో ఒక్కస్త్రీ ఫొటోతో 100 ఓట్లు**

**హెచ్ ఫైల్స్ పేరిట.. 'హైడ్రోజన్ బాంబ్' పేల్చిన రాహుల్**

**రాహుల్‌వి తప్పుడు ఆరోపణలని కొట్టిపారేసిన బీజేపీ**

న్యూఢిల్లీ, నవంబరు 5: "బీజేపీ నేతల్లారా సిద్ధంగా ఉండండి.. ఆటంబాంబు తర్వాత హైడ్రోజన్ బాంబు రాబోతోంది. మీ ఓట్ల చోరీ బండారాన్ని దేశప్రజల ముందు బయటపెడతాం".. అని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఈ ఏడాది సెప్టెంబరు 1న బిహార్‌లో 'ఓటర్ అధికార్ ర్యాలీ'లో ప్రకటించిన సంగతి గుర్తుందా? ప్రజలంతా ఆసక్తిగా ఎదురుచూసిన ఆ హైడ్రోజన్ బాంబును ఆయన.. బిహార్‌లో ఎన్నికలకు ఒక్కరోజు ముందు.. బుధవారం ఇక్కడ 'ద హెచ్ ఫైల్స్' పేరిట నిర్వహించిన మీడియా సమావేశంలో పేల్చారు. గత ఏడాది జరిగిన హరియాణా శాసనసభ ఎన్నికల్లో 25 లక్షల నకిలీ ఓట్లతో బీజేపీ గెలిచిందని.. ఆ ఎన్నికను చోరీ చేసిందని తీవ్ర ఆరోపణలు చేశారు. హరియాణాలో కాంగ్రెసకు దక్కాల్సిన ఘనవిజయాన్ని ఓటమిగా మార్చడం కోసం చేపట్టిన 'ఆపరేషన్ సర్కార్ చోరీ'కి.. ఈసీ కూడా సహకరించిందని.. ప్రధాని మోదీ, అమిత్‌షాలతో, బీజేపీతో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, మిగతా ఇద్దరు ఎన్నికల కమిషనర్లు కుమ్మక్కయ్యారని ఆరోపించారు. హరియాణా ఓటరు జాబితాలో 25,41,144 మంది నకిలీ ఓటర్లు ఉన్నారని.. 5,21,619 డూప్లికేట్ ఓట్లు ఉన్నాయని.. 93,174 మంది ఓటర్ల చిరునామాలు తప్పుగా ఉన్నాయని.. 1,24,177 నకిలీ ఫొటోలు ఓటర్ ఐడీల్లో ఉన్నాయని పేర్కొన్నారు.

# చెత్త ఎవరిదో.. సత్తా ఎవరిదో తేలిపోవాలి

**హైదరాబాద్ అభివృద్ధిపై చర్చకు సిద్ధమా..**

**సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ సవాల్**

**బీఆర్ఎస్ హయాంలో జూబ్లీహిల్స్‌లో జరిగిన అభివృద్ధిపై నివేదిక విడుదల**

**దమ్ముంటే ఫార్ములా ఈ కేసులో తనను అరెస్టు చేయాలని వ్యాఖ్య**




**హైదరాబాద్, నవంబరు 5:** హైదరాబాద్ అభివృద్ధి అంశంపై చర్చ పెడితే బీఆర్ఎస్ హయాంలో ఏం జరిగిందో, కాంగ్రెస్ పాలనలో ఏం జరిగిందో తేలిపోతుందని.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆ చర్చకు సిద్ధమా? అని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సవాల్ చేశారు. ఆ చర్చతో చెత్త ఎవరిదో ? సత్తా ఎవరిదో తేలిపోతుందన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో ఓడిపోతామనే అసహనంతో ముఖ్యమంత్రి ఏదేదో మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఈ మేరకు బీఆర్ఎస్ హయాంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధికి సంబంధించిన నివేదికను బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడు తూ.. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ అనైతిక బం ధం కొనసాగిస్తున్నాయని, రాష్ట్రంలో రెండు జాతీయ పార్టీల ఉమ్మడి ప్రభుత్వం నడుస్తోం దని ఆరోపించారు. మోదీతో రేవంత్‌రెడ్డిది ఫెవికాల్ బంధమన్నారు. సీబీఐ, ఈడీ తదితర సంస్థలను రాహుల్ గాంధీ విమర్శిస్తుంటే అవే సంస్థలను రేవంత్ నమ్ముతారని విమర్శించారు. ఏడాదిన్నర, రెండేళ్లలో రేవంత్ రెడ్డి బీజేపీలో చేరడం ఖాయమన్నారు. కాంగ్రెస్ ఉంటేనే ముస్లిం లు ఉంటారంటూ సీఎం చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టిన కేటీఆర్.. కాంగ్రెస్ పుట్టక ముందు నుంచే దేశంలో ముస్లింలు ఉన్నారన్నారు. మైనార్టీలను అవమానించినందుకు సీఎం రేవంత్ క్షమాపణ చెప్పాలని లేనిపక్షంలో ప్రజలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. హైదరాబాద్‌ను ఎవరు ఎంత అభివృద్ధి చేశారో తేల్చేందుకు దమ్ముంటే చర్చకు రావాలని సీఎంకు కేటీఆర్ సవాల్ విసిరారు. పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్, అసెంబ్లీ, గాంధీభవన్‌ల్లో ఎక్కడ చర్చ పెట్టినా తాను వస్తానని స్పష్టం చేశారు. పదేళ్లలో బీఆర్ఎస్ ఏం చేసిందో.. రెండేళ్లలో కాంగ్రెస్ ఏం చేసిందో చర్చకు సిద్ధమా? అని రేవంత్ రెడ్డిని నిలదీశారు. ఆ చర్చతో చెత్త ఎవరిదో, సత్తా ఎవరిదో తేలిపోవాలన్నారు. జూబ్లీహిల్స్‌లో ఓడిపోతామనే అసహనంతో సీఎం ఏదేదో మాట్లాడుతున్నారని, ఆయన భాషలో అర్థమయ్యేటట్లు బదులిచ్చే సత్తా ఉన్నా.. తాము గౌరవంగానే మాట్లాడతామని చెప్పారు.

# బిహార్‌లో తొలి విడత పోలింగ్ నేడే

**121 అసెంబ్లీ స్థానాలు.. బరిలో 1,314 మంది అభ్యర్థులు**

**తేజస్వి, తేజ్‌ప్రతాప్, సామ్రాట్ చౌధురి సహా కీలక నేతలు**

**3.75 కోట్ల మంది ఓటర్ల చేతిలో నేతల భవితవ్యం**

**పోలింగ్ కేంద్రాలు 45,341.. కొత్త ఓటర్లు 10.72 లక్షలు**

**'సర్' తర్వాత తొలి ఎన్నికలివే!**

**ఎన్‌డీఏ వైపే బిహార్ మొగ్గు.. మూడు సర్వేల్లో వెల్లడి**



**పట్నా, నవంబరు 5:** బిహార్ శాసనసభ ఎన్నికల్లో గురువారం మొదటి దశ పోలింగ్ జరుగనుంది. మొత్తం 243 అసెంబ్లీ స్థానాలకు గాను 121 సీట్లకు ఎన్నికలు జరుగనున్నాయి. సీఎం నితీశ్‌కుమార్ సారథ్యంలోని ఎన్‌డీఏ, ప్రతిపక్ష నేత తేజస్వి యాదవ్ నేతృత్వంలోని మహాగఠ్‌బంధన్, రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ స్థాపించిన జన్‌సురాజ్ పార్టీ సహ వివిధ పార్టీల నుంచి 1,314 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. మహాగఠ్‌బంధన్ సీఎం అభ్యర్థి తేజస్వి (రాఘోపూర్), బీజేపీకి చెందిన ఉపముఖ్యమంత్రులు సామ్రాట్ చౌధురి (తారాపూర్), విజయకుమార్ సిన్హా (లఖీసరాయ్), మంత్రులు మంగళ్ పాండే (శివన్), నితిన్ నవీన్ (బంకీపూర్), సంజయ్‌సరోగి (దర్భంగా), జీవేశ్‌కుమార్ (జాలే), కేదార్‌ప్రసాద్ గుప్తా (కుర్హని), జేడీయూ మంత్రులు శ్రావణ్‌కుమార్ (నలంద), విజయకుమార్ చౌదురి (సరాయ్‌రంజన్), మాజీ సీఎం లాలూప్రసాద్ యాదవ్ పెద్దకుమారుడు, జనశక్తి జనతాదళ్ అధినేత తేజ్‌ప్రతాప్ యాదవ్ (మహువా) తదితరుల భవితవ్యాన్ని 3.7 కోట్ల మంది ఓటర్లు తేల్చనున్నారు. రాఘోపూర్‌లో గెలిచి హ్యాట్రిక్ కొట్టాలని తేజస్వి భావిస్తున్నారు. ఆయనపై బీజేపీకి చెందిన సతీశ్‌కుమార్ పోటీచేస్తున్నారు. ఈయన 2010 ఎన్నికల్లో తేజస్వి తల్లి, మాజీ సీఎం రాబ్రీదేవిని ఓడించారు. ఇక్కడి నుంచే బరిలోకి దిగుతానని ప్రశాంత్ కిశోర్ గతంలో ప్రకటించా రు. అయితే రాష్ట్రమంతా ప్రచారం చేయాల్సి ఉన్నందున ఎన్నికల్లో పోటీచేయకూడదని ఆయన నిర్ణయించుకున్నారు. చంచల్‌సింగ్ అనే నేతకు ఇక్కడ టికెట్ ఇచ్చారు. యువ జానపద గాయని మైథిలి ఠాకూర్ బీజేపీ తరఫున అలీగంజ్ నుంచి.. భోజ్‌పురీ సూపర్‌స్టార్లు ఖేసరిలాల్ యాదవ్ (ఛాప్రా-ఆర్‌జేడీ), రితేశ్ పాండే (కార్గాహార్-జన్‌సురాజ్) కూడా బరిలో ఉన్నారు. జనసురాజ్ కార్యకర్త హత్య కేసులో ప్రస్తుతం జైల్లో ఉన్న అనంత్‌సింగ్ (జేడీయూ) మొకామా నుంచి పోటీచేస్తున్నారు. ఆయనపై మరో గ్యాంగ్‌స్టర్ సూరజ్‌భాన్ భార్య వీణాదేవి ఆర్‌జేడీ తరఫున బరిలో ఉన్నారు. తొలి విడతలో 45,341 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. గ్రామీణ ప్రాంతాల్లో అత్యధికంగా 36,733 ఉన్నాయి.

# అంగరంగ వైభవంగా కందగిరి
# లక్ష్మి నరసింహా స్వామి వారి కళ్యాణం

**తెల్లవారుజాము నుంచే పోటెత్తిన భక్తులు**
**ఎమ్మెల్యే దంపతులు మొక్కులు చెల్లించుకున్నారు**
**పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు ఎస్సై నగేష్**
**భక్తులతో కిక్కిరిసిన పకృతి రమణీయమైన కందగిరి పర్వతం**
**భగవంతుని ఆశీస్సులు ఉంటే వచ్చే జాతర నాటికి మెట్లు నిర్మిస్తా**

**తొవ్వ న్యూస్ ప్రతినిధి, కురవి, నవంబర్ 5,** కళ్యాణం కమనీయం రమణీయం అందాలొలికే పకృతి రమణీయంతో భక్తజన సందోహంతో కందగిరి పర్వతం పులకించిపోయి భక్తులను ఆస్వాదించుకుంది. విశ్వ వసు నామ సంవత్సరం కార్తీకమాసం శరత్ ఋతువు దక్షిణ యానం మంగళవారం రాత్రి, తెల్లవారితే బుధవారం నాలుగు గంటల 30 నిమిషాలకు మొదలుకొని ఐదు గంటల 40 నిమిషాలకు అశ్విని నక్షత్రం కార్తీక పౌర్ణమి, వృషభ లగ్నంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి కళ్యాణం అంగరంగ వైభవంగా అర్చకులు ప్రసాద్ చార్యులు, వినయ్ చార్యులు, నిర్వహించారు, గురువారం రాత్రి కొండపైకి చేరుకొని కోనేటిలో స్నానమాచరించి స్వామి వారి కళ్యాణి తిలకించినట్లు భక్తులు తెలిపారు. డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ రామచంద్రనాయక్ సతీమణి డాక్టర్ ప్రమీల స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి కొబ్బరికాయలు కొట్టి డోర్నకల్ నియోజకవర్గం తెలంగాణ రాష్ట్రం సస్యశ్యామలంగా ఉండాలని అన్నీ కలిసి వచ్చి కాలం ప్రతికూలంగా ఉంటే వచ్చే సంవత్సరం జాతర నాటికి కొండపైకి మెట్లు నిర్మాణాన్ని ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే తరపున తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో వస్తారని ఊహించే అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు నిర్వహించాలని డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ రామచంద్రనాయక్ అధికారులకు సూచించగా ఎంపీడీవో కే వీరబాబు, ఎమ్మార్వోలు విజయ, పున్నం చందర్, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

ఆర్డబ్ల్యూఎస్ వారు మంచినీటి ఏర్పాటు చేసినట్టు తెలిపారు, భక్తులు ప్రశాంతమైన వాతావరణంలో పకృతి అందాల లోయలో ఏడుకొండల పై వెలసిన స్వామివారిని దర్శించుకుని క్షేమంగా వారి వారి గమ్యస్థానాలకు చేరాలని భక్తులకు ఎమ్మెల్యే సూచించారు. శానిటేషన్ ఏర్పాట్లు, జాతరలో ఎక్కడ కూడా ఎలాంటి చెత్తాచెదారం లేకుండా ఎప్పటికప్పుడు శానిటేషన్ చేయించినట్లు ఎంపీడీవో కే వీరబాబు తెలిపారు. ఇతర గ్రామ పంచాయతీల నుంచి ట్రాక్టర్లను సిబ్బందిని రప్పించి జాతర లో అపరశు భ్రంగా లేకుండా శుభ్రంగా ఉంచి నట్లు తెలిపారు. రోలు ఎస్సై సంతోష్. మహబూబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఆదేశాలతో తొర్రూరు డిఎస్పి కృష్ణ కిషోర్, సలహాలు సూచనలతో మరిపెడ సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజ్ కుమార్ పర్యవేక్షణలో బందోబస్తు నిర్వహించినట్లు ఎస్సై సంతోష్ తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా గుట్టకు రెండు వైపులా పార్కింగ్ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. అయ్యగారి పల్లి వైపు నుంచి వచ్చే ద్విచక్ర వాహనాలను కెనాల్ కాలవ నుంచి కందికొండ రోడ్డుకు మళ్లించామని తెలిపారు. ట్రాఫిక్ జామ్ కాకూడదని ద్విచక్ర వాహనాలను కెనాల్ వైపు మళ్లించి నట్లు ఎస్సై తెలిపారు. భక్తులు కూడా సహకరించి వాహనాలను పద్ధతి ప్రకారం పార్కింగ్ చేసుకున్నారని అందువల్లే ట్రాఫిక్ జామ్ కాలేదని తెలిపారు. జాతరలో ఎలాంటి సంఘటనలు దుర్ఘటనలు జరగకుండా ప్రశాంతంగా జరిగిందని సహరించిన భక్తులకు సిబ్బందికి రాజకీయ నాయకులకు ధన్యవాదములు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు అంబటి వీరభద్రం. గుండ్రాతిమడుగు పిఏసిఎస్ చైర్మన్ గార్లపాటి వెంకటరెడ్డి. జిల్లా నాయకులు బండి శ్రీనివాస్. బండి లక్ష్మారెడ్డి. కిసాన్ పరివార్ సీఈవో డాక్టర్ వివేక్. వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్. మండల నాయకులు తవణం సుఖేందర్ రెడ్డి. దొంగల జనార్దన్ రెడ్డి. జక్కుల నాగన్న. శ్రీపాద పూర్ణచారి, ఏపీఓ భూపాల్ రెడ్డి. పంచాయతీ కార్యదర్శులు, రాము నాయక్. అశోక్. నరేష్. తదితరులు పాల్గొన్నారు.

# కేసముద్రం మండలంలో అండర్ బ్రిడ్జి నిర్మాణం..

**కల నెరవేరబోతున్న సందర్భంగా సంతోషాన్ని వ్యక్తం చేసిన కమ్యూనిస్టు పార్టీల నాయకులు..**

**తొవ్వ,కేసముద్రం,** నవంబర్ 05:కేసముద్రం మండలం మున్సిపాలిటీగా రూపాంతరం చెంది అభివృద్ధి దిశగా ఓ పక్క రోడ్డు వెడల్పు కార్యక్రమం జరుగుతా ఉంటే ఈ సందర్భంగా మండలానికి మరో శుభవార్త అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టడం సంతోషకర విషయం అని అన్నారు. మండలానికి అండర్ బ్రిడ్జి సాంక్షన్ఇప్పించిన టువంటి వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.




కమ్యూనిస్టు పార్టీల నాయకులు మార్తినేని పాపారావు, చొప్పరి శేఖర్, ఆవుల కట్టయ్య, శివారపు శ్రీధర్,మోడెంవెంకటేశ్వర్లు,మరిపెల్లి మొగిలి, నీరుటి జలంధర్, జాటోత్ బిచ్చ నాయక్ మడతనారాయణ, సంద వెంకన్న, సింగని బిక్షం, తదితరులు పాల్గొన్నారు

# బీహార్‌లో మార్పుకు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చిన పొంగులేటి

**"ఎన్డీయే పాలనే వెనుకబాటుకు కారణం"**



పశ్చిమ చంపారన్ (బీహార్), నవంబర్ 5 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి): బీహార్ అభివృద్ధి అడ్డంకులకు కారణం రెండు దశాబ్దాల ఎన్డీయే పాలనలో కొనసాగిన అవినీతి, అవకాశవాద రాజకీయాలేనని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. పశ్చిమ చంపారన్ జిల్లా చనపటియా నియోజకవర్గంలో జరిగిన ప్రచార సభలో ఆయన ప్రసంగించారు. ఈ సభలో కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ, రాష్ట్ర ఇన్‌చార్జ్ కృష్ణన్ అల్వార్, అభ్యర్థి అభిషేక్ రంజన్ పాల్గొన్నారు.

ఎన్డీయే భారీ హామీలతో ప్రజలను మోసగిస్తోందని అన్నారు. "ఒక కోటి ఉద్యోగాలు, ఒక కోటి మహిళలకు ఆర్థిక స్వావలంబన" వంటి వాగ్దానాలు చేస్తూ పదేపదే ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని విమర్శించారు. "20 ఏళ్లలో యువతకు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారు? మహిళల జీవితాల్లో నిజమైన మార్పు ఎంత తీసుకువచ్చారు?" అని ప్రశ్నించారు. ప్రజలు అవకాశం ఇస్తే బీహార్‌లో తెలంగాణ మాదిరి ప్రజల పాలన తీసుకువస్తామని పొంగులేటి హామీ ఇచ్చారు. తెలంగాణలో రైతు రుణమాఫీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ?500లో గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్ల వంటి సంక్షేమ పథకాల ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చినట్లు గుర్తుచేశారు. బీహార్‌లో కూడా అభివృద్ధి%–%సంక్షేమాలకు సమాన ప్రాధాన్యత ఇచ్చే పాలన అమలు చేస్తామని తెలిపారు. గెలిస్తే తేజస్వి యాదవ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తారని ఆయన స్పష్టం చేశారు. మరోవైపు, ఎన్డీయే ఇప్పటివరకు తమ ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించలేకపోవడం వారి బలహీనతను చూపుతున్నదని వ్యాఖ్యానించారు. బీహార్ ప్రజలు ఈసారి తెలివిగా నిర్ణయం తీసుకుని మార్పుకు మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు.

# సామాజిక సేవలోనే నిజమైన సంతృప్తి

**తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు అగిరి వెంకటేష్**



**హైదరాబాద్, నవంబర్ 05:** సామాజిక సేవలోనే నిజమైన సంతృప్తి ఉంటుందని తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు అగిరి వెంకటేష్ అన్నారు. ఆర్య వైశ్య సంఘం ఇసామియాబజార్ అధ్యక్షుడు కల్వకుంట్ల శ్రీనివాస్ గుప్తా అధ్యక్షతన బుధవారం 'చేయుత' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని నిరుపేద ఆర్యవైశ్య కుటుంబాలకు నెలవారి పెన్షన్ తో పాటు నెల రోజులకు ఇంటికి సరిపడ కిరాణా సామాగ్రిని అందజేశారు. సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ బెజుగం శ్రీధర్ శీతాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని 22 మందికి దుప్పట్లను అందజేశారు. ఆనంతరం అగిరి వెంకటేష్ మాట్లాడుతూ.. ఎంత సంపాదించినా రాని ఆనందం పేదరికంలో మగ్గుతున్న వారికి చేయూత అందించడంలో ఉంటుందన్నారు. ఆర్యవైశ్య సంఘం ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహించిన శ్రీనివాస్ గుప్తా భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గాదె మహేష్, నిఖిలేశ్వర్ కొక్కనద, కొమిరిశెట్టి అనిల్, విప్పల అనిల్ కుమార్, యెర్రం లక్ష్మణ్, మహిళా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# విత్తనాలు,ఎరువుల కొనుగోలు,పంటల నమోదుకు రైతులకు అవగాహన

**-మండల వ్యవసాయ అధికారి రాజు**



**బయ్యారం,తోవ్వ,నవంబర్ 5** 2025-26 రబీ పంట సంవత్సరానికి గాను ఎరువులు విత్తనాలు పంపిణీ పంటల నమోదుకు సంబంధించిన వివరాలను రైతులు వ్యవసాయ అధికారుల సలహా సూచన మేరకు సాగు చేయాలని మండల ఏవో కే.రాజు అన్నారు.ఈ సందర్భంగా రైతులు లైసెన్స్ పొందిన ప్రైవేట్ దుకాణదారులు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల ఆగ్రో రైతు కో-ఆపరేటివ్ సొసైటీల ద్వారా విత్తనాలను కొనుగోలు చేయాలని తెలిపారు. దుకాణదారుడు విత్తన లైసెన్సు నంబరు స్పష్టంగా ప్రదర్శించబడి బిల్లులు ఇవ్వాలని తెలిపారు. అనధికార షాపుల నుండి విత్తనాలను పురుగు మందులను కొని మోసపో వద్దని సూచించారు. విత్తనాలు మొలకెత్తనపుడు, పురుగుమందులు నకిలీ మందులు అయినప్పుడు మన బిల్లు ద్వారా సంబంధిత షాప్ పై వినియోగదారుల ఫోరంలో గాని,ఇతర న్యాయపరంగా రైతులకు న్యాయం చేకూరే విధంగా ఉంటుందని సూచించారు.రైతులు విత్తనాల బిల్లులు పంట అయిపోయే వరకు భద్రంగా భద్రపరుచుకోవాలని తెలిపారు.

# కేసముద్రం శ్రీధర్మశాస్త దేవాలయంలో భారీగా అయ్యప్ప మాల ధరించిన స్వాములు

**తొవ్వ,కేసముద్రం,నవంబర్ 05:** కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప దేవాలయంలో బుధవారం నాడు పవిత్ర కార్తీక మాసం కార్తీక పౌర్ణమి పండుగ పురస్కరించుకొని దేవాలయ ప్రధాన తాంత్రి వర్యులు బ్రహ్మశ్రీ విష్ణు నారాయణ పొట్టి చేతుల మీదుగా అలంకానిపేట, కోరుకొండపల్లి, రెడ్యా నాయక్ తండా, బొల్లికొండ, బిచ్చనాయక్ తండ,నారాయణపురం, నెక్కొండ,చిన్నకొర్పోలు, గోవింద పురం, ఆలేరు, ఎన్టీఆర్ నగర్, రాజులకొత్తపల్లి ,తిరుమలగిరి గ్రామాలకు చెందిన అయ్యప్ప భక్తులు 250 మంది మాల ధారణ చేపట్టినట్లు అన్నదాన సేవా సొసైటీ బాధ్యులు పోలేపల్లి యాకూబ్ రెడ్డి, బోగోజు నాగేశ్వర చారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోనే శ్రీ చక్ర యంత్రస్థాపనతో ఏకశిలా పదనెట్టంబడి కలిగి ఉన్న కేసముద్రం శ్రీ ధర్మశాస్త్ర దేవాలయం గుర్తింపు పొందడం వలన భారీ స్థాయిలో అయ్యప్ప మాల ధారణ చేపట్టే భక్తులు పెరుగుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గురు స్వాములు మాదాసు రవి, రాగిరి రవీందర్, ఏ. సురేందర్, నీలం ఎలేందర్, కుమారస్వామి, బిచ్చ నాయక్, వీరన్న, వెంకన్న, ప్రభాకర్ రెడ్డి, కక్కెర్ల ఐలయ్య,అయ్యప్ప దీక్ష దారులు పాల్గొన్నారు.

# ఎలాంటి శరతులు లేకుండా సీసీఐ పత్తి కొనుగోలు చేయాలి

**రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మేక అశోక్ రెడ్డి**



**యాదాద్రి జిల్లాబీ రామన్నపేట: తొవ్వ ప్రతినిధిబీ నవంబర్ 5** పత్తి రైతుల వద్ద ఎకరాకు 7క్వింటల్ మాత్రమే కొనుగోలు చేస్తామనే నిబంధన ఎత్తివేసి, 20శాతం తేమ ఉన్నా షరతులు విధించకుండా పత్తిని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిరిపురం గ్రామంలో సిపిఎం-రైతు సంఘం ఆధ్వర్యంలో ఇటీవల కురు స్తున్న తుఫాను మూలంగా నష్టపో యిన పత్తి పంటను పరిశీలించి, రైతులతో సమస్యలు అడిగి తెలుసు కొని అనంతరం మాట్లాడుతూ అప్పులు చేసి పెట్టుబడి పెట్టి చేత్తికొచ్చే సమయానికే వర్షాలు నిండా ముంచాయని ఇదిలా ఉంటే ఎకరాకు కేవలం 7క్వింటాలు మాత్రమే కొనుగోలు చేస్తామని ప్రభుత్వం షరతులు పెట్టడంతో కపాస్ కిసాన్ యాప్ గురించి రైతులకు సాంకేతిక అవగాహన లేక ముందస్తుగా నమోదు చేసుకోలేక పోవడంతో పత్తిని సీసీఐ కేంద్రాలు కొనుగోలు చేయడం లేదని అన్నారు. కొనక పోవడంతో నాలుగు వేల ధరకు ప్రయివేటు వ్యాపారులకు అమ్ముకొని నష్టపోవాల్సి వస్తుంద˝న్నారు.కపాస్ కిసాన్ యాప్ తో కాకుండా టోకెన్ విధానంతో వ్యవ సాయ అధికారులు పర్యవేక్షించాల న్నారు. ఎలాంటి శరతులు లేకుండా ఎకరానికి 12 క్వింటాళ్ళు కొనుగోలు చేయాలని అన్నారు. తెమశాతం 20శాతం ఉన్నా మద్దతు ధరకు కొనుగోలు చేయాలన్నారు. మోడీ ప్రభుత్వం పత్తి పంటపై విదేశీ సుంకం 11శాతం కు తగ్గించాలని చూస్తుందని అలా అయితే మద్దతు ధర తగ్గుతుందని రైతులకు నష్టం జరుగుతుం దన్నారు.అధిక వర్షాలకు నష్టపోయిన పత్తి రైతులకు ప్రభుత్వం ఎకరానికి 50వేల రూపాయలు నష్టపరిహారం అందించి ఆదుకోవా లన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటి సభ్యులు బల్గురి అంజ య్య, శాఖ కార్యదర్శి అంబటి సురేందర్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు "యదల్ల" యాదవ రెడ్డి జన్మదినం... పేద ప్రజల శుభదినం

### కాంగ్రెస్ మండల అధ్యక్షులు గొల్లపల్లి ప్రభాకర్ గౌడ్

### పార్టీ శ్రేణుల మధ్య ఘనంగా జన్మదిన వేడుకలు



**తొవ్వ, నెల్లికుదురు, నవంబర్ 05**
మహబూబాబాద్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎదల్ల యాదవ రెడ్డి జన్మదినం పేద ప్రజల శుభదినము అని కాంగ్రెస్ మండల అధ్యక్షులు గొల్లపల్లి ప్రభాకర్ గౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని పార్వతమ్మ గూడెం గ్రామంలో ఆయన స్వగృహంలో మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా మాజీ జెడ్పిటిసి సభ్యులు హెచ్ వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు వలబోజు వెంకటేశ్వర్లు, నాయిని శ్రీపాల్ రెడ్డి లతోపాటు మండల నేతలతో కలిసి పూల బొకే అందించి శాలువాతో ఘనంగా సత్కరించి, కేక్ కట్ చేసి ఆయనకు స్వీట్లు తినిపించారు.

అనంతరం వారు మాట్లాడుతూ నాన్నగారైన స్వర్గీయ కాంగ్రెస్ జిల్లా నేత కొమ్మాల్ రెడ్డి ఆశయ సాధన కోసం రాజకీయాల్లో చేరి ఎన్నో ఏళ్లుగా పేద ప్రజలకు సేవలు అందిస్తున్న ఏకైక నేత యాదవ రెడ్డి అని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను పేద ప్రజలకు చేరవేయడంతో పాటు అందరికీ తలలో నాలుక లాగా ఉంటూ తనదైన శైలిలో సేవలందిస్తున్నారన్నారు. ఆయన మరెన్నో ఉన్నత పదవులు పొందాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నామన్నారు. అంతే కాకుండా ఆయురారోగ్యాలతో ఐశ్వర్యాలతో కుటుంబం సంతోషంతో ఉండాలని ఆ భగవంతుని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధికార ప్రతినిధి మట్టా వెంకటరెడ్డి, మండల కార్యదర్శి సొంటి రెడ్డి అశోక్ రెడ్డి, మండల నేతలు ఇట్టే దేవేందర్ రెడ్డి, నల మాస తోతాద్రి (శ్రీనివాస్ గౌడ్) రాపాక వీరభద్రరావు యాదవ్, మంగి మల్లయ్య, జనార్ధన్, నెల్లికుదురు పట్టణ అధ్యక్షులు రత్నపురం యాకయ్య, మైనార్టీ నాయకులు మౌలానా, ఆయా గ్రామాల గ్రామ శాఖ అధ్యక్షులు బెల్లి నరసయ్య, పల్లె యాకయ్య గౌడ్, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ బొల్లెపల్లి సతీష్ గౌడ్, యూత్ కాంగ్రెస్ నాయకులు పెరుమాండ్ల జగన్ గౌడ్, నిదానం పల్లి ప్రవీణ్, ఆయా గ్రామాల నేతలు తదితరులున్నారు.

# రైతులకు ఎలాంటి నిబంధనలు కొర్రీలు లేకుండా పత్తి కొనుగోలు చేయాలి

### బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం



**యాదాద్రి జిల్లా :రామన్నపేట: తొవ్వ ప్రతినిధి: నవంబర్ 5**
రామన్నపేట మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి పత్తి పంట సాగు చేస్తే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పత్తి రైతులను చాలా ఇబ్బందులకు గురిచేస్తున్నాయి .పకృతి వాతావరణం సహకరించక నెల రోజుల నుండి ఎడతెరిపిలేని వర్షాలకు రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇప్పటికే పత్తి సాగుకు పెట్టుబడి పెరిగి కూలీలు దొరకక నిండా మునిగిన రైతులకుతాజాగా ప్రభుత్వాలు తీసుకొచ్చిన కొత్త నిబంధనలతో స్లాట్ విధానంలో పత్తి అమ్మకానికి ముందే స్లాట్ బుక్ చేసుకోవడం ఓటీపీ సమస్యలు ఒక ఎకరంకు 7 ఏడు క్వింటాళ్ల పత్తి దిగుబడిని మాత్రమే కొనుగోలు చేస్తామని తేమశాతం 8 నుండి 12 శాతం వరకు ఉంటే మాత్రమే దిగుబడి చేసుకుంటామని పత్తి కేంద్రం వద్ద అధికారులు చెప్పుతుండడంతో తేమ శాతం ఎక్కువ రావడం వల్ల పత్తి కొనుగోలు చేయడం లేదు. ఏమి చేయాలో అర్థం కాక రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో దళారుల వద్ద తక్కువ ధరలకు క్వింటాకు 5000 నుండి6000 అమ్ముకొని రైతులు తీవ్రంగా నష్టపోవడం జరుగుతుంది. రైతులుగత సంవత్సరం మాదిరిగానే రైతులకు ఎకరంకు 12 క్వింటాళ్ల పత్తిని సిసిఐ కొనుగోలు చేయాలని తేమ శాతం ఎక్కువగా ఉన్న కొనుగోలు చేయాలని పత్తి అమ్మకానికి స్లాట్ విధానాన్ని రద్దు చేసి రైతు ఇష్టమున్న కాటన్ మిల్లు వద్ద పత్తి అమ్ముకో వడానికి అవకాశం కల్పియాలని ఈ సంవత్సరం తీసుకొచ్చిన కొత్త నిబంధనలను వెంటనే ఎత్తివేయాలని ప్రభుత్వాలను కోరారు.

# బాధిత కుటుంబాలకు మెపా భరోసా..

### వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్

### జెట్టి రాజయ్య ముదిరాజ్ చిత్ర పటానికి నివాళులు అర్పించిన మెపా కమిటీ సభ్యులు





**తొవ్వ, నర్సింహులపేట, నవంబర్. 05**
మండల కేంద్రంలోని జయపురం గ్రామంలో ముదిరాజ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తండ్రి పదవరోజు సందర్భంగా మేప రాష్ట్ర కమిటీ సభ్యులు నివాళులర్పించి కష్టం వచ్చిన కుటుంబాలకు (ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్) అండగా ఉంటుందని వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్ అన్నారు. ఈ మేరకు మహబూబాబాద్ జిల్లా మెపా ప్రధాన కార్యదర్శి జెట్టి యాకయ్య ముదిరాజ్ తండ్రి అనారోగ్య రీత్యా మరణించారు. ఈ సందర్భంగా గురువారం నిర్వహించిన దశదినకర్మ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్,రాష్ట్ర ఉపాధ్యక్షులు చిరుత వెంకటేశ్వర్లు ముదిరాజ్ , రాష్ట్ర కమిటీ, వివిధ జిల్లాల బాద్యులతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, రాజయ్య చిత్ర పటానికి నివాళులు అర్పించి,మెపా అండగా ఉంటుందని యాకయ్య ముదిరాజ్ కు భరోసానిచ్చారు.ఈ సందర్బంగా రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ.రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడ ముదిరాజ్ కుటుంబం బాధలో ఉన్నా.. మెపా పరామర్శించి ధైర్యం చెబుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో మెపా జిల్లా అధ్యక్షులు దుండి అశోక్ , రాష్ట్ర ఉపాధ్యక్షులు చిరుత వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి తోట రమేష్ ముదిరాజ్, ముదిరాజ్,జిల్లా నాయకులు: తోట సురేష్ ముదిరాజ్, రొయ్యల చంటి,తోట సతీష్, జయపురం కుల పెద్దమనిషి జెట్టి బిక్షం,సొసైటీ అధ్యక్షులు జెట్టి రవి, సభ్యులు: కలవల నాగన్న, వెంకన్న, జెట్టి వెంకన్న,కిరణ్, రాజు,శ్రీకాంత్, మనోజ్,చిట్టబోయిన వెంకటేష్, సురేష్,యాకన్న ముదిరాజ్ లతో పాటు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# టేకులసోమారం చెరువు వద్ద కట్టమైసమ్మకు పూజలు



**యాదాద్రి జిల్లా వలిగొండ: తొవ్వ ప్రతినిధి:నవంబర్ 5**
బునాది కాలువ ద్వారా వచ్చే నీళ్లు కరివేనుకుంట చెరువు నిండి, నల్లచెరువు అలుగు పోస్తున్న సంద ర్భంగా కాంగ్రెస్ పార్టి నాయకులు పార్టీ చేగూరి మల్లేశం ,గ్రామ పెద్దలు, చెరువును పరిశీలించారు. అనంతరం కట్ట మైసమ్మ కి కొబ్బరికాయ కొట్టి చెరువు గంగమ్మ కి హారతి ఇచ్చి పూలు వేసి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు అందరూ కలిసి చేగూరి మల్లేశం ని శాలువతో సత్కరించారు .రైతులు మాట్లాడుతూ బూనాది గాని కాలువ చేగూరి మల్లేశం సొంత డబ్బులతో ఈ కాల్వను తవ్వించడం వలన చెరువు నిండి అలుగు పోస్తుంది అని చేగూరి మల్లేశం కి రైతుల ప్రక్షాళ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు,, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు మల్లేషన్న యువ సేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# బిహార్ ఓటర్లు కోరుతున్న మార్పు ఏమిటి

'బద్లావ్ తో హోనా ఛాహియే' (ఒక మార్పు రావాలి) అని తనను తాను 'నాయీ'గా స్వయంగా చెప్పుకున్న ఒక పెద్ద మనిషి అన్నాడు. ఆ వ్యాఖ్యకు ప్రతిస్పందనగా కర్పూరీ ఠాకూర్ గురించి నేను ప్రస్తావించాను. ఆయన ముఖంలో ఆనందరేఖలు విరిశాయి. అయితే తాను, తన కుటుంబలోని 20 మంది ఓటర్లు ఓటు వేసేందుకు ప్రేరణ అయ్యే మార్పు ఏమిటో ఆయన విడమరిచి చెప్పలేదు. 'అబ్ ఆప్ సమ్జా జాయియే' (మీరు మీ అభిప్రాయానికి రావచ్చు) అని ఆయన నిష్కర్షగా అన్నాడు. మార్పు ఏమిటి? ప్రభుత్వం మారడం, పాలనా వ్యవస్థలో మార్పు సంభవించడమే మార్పు అని నేను విశ్వసిస్తున్నాను. బిహార్‌కే కాదు, దేశానికీ ఇటువంటి మార్పు అత్యవసరమని, జరూరుగా జరగాలని భావిస్తున్నాను. అయితే బిహార్ ఓటర్లు ఆకాంక్షిస్తున్న మార్పు బహు విధాలుగా ఉండడంతో పాటు అస్పష్టంగా ఉన్నది. ఉత్తర బిహార్‌లో పక్షం రోజుల పర్యటనతో ఈ వాస్తవం నాకు తెలిసివచ్చింది. మార్పు బహుళత్వం, అస్పష్టత గురించి నా పర్యటనానుభవాలు నన్ను జాగరూకుడిని చేశాయి. సాధారణ ఓటర్ల (అత్యధికులు పురుషులే)తో మాటా మంతీ ద్వారా బిహారీలు బహుళ మార్పులు కోరుతున్నారని, అవి ఒక దానితో ఒకటి పోటీ పడడమే కాకుండా ఘర్షణపడుతున్నాయని కూడా నాకు విశదమయింది. అనేక పరివర్తనలను సాధించవలసిన బృహత్తర బాధ్యతను సున్నిత ప్రజాస్వామిక సాధనమైన ఓటు నిర్వహిస్తోంది. ఆ పరివర్తనలను సంపూర్ణంగా సాధించడంలో ఇప్పటికే చాలా జాప్యం చోటుచేసుకున్నది. మొదటి మార్పు సామాజిక న్యాయం. అగ్ర కులాల ఆధిపత్యానికి వ్యతిరేకంగా సాధించవలసిన సామాజిక విప్లవం. బిహార్ జనాభాలో 11 శాతం కంటే తక్కువగా ఉన్న అగ్ర కులాలవారు సమాజం, ఆర్థిక వ్యవస్థ, రాజకీయాలపై సంపూర్ణ పెత్తనం చెలాయిస్తున్నారు. పేదలు, నిరుపేదలను సంఘటితపరచడం ద్వారా కుల వ్యవస్థ వెన్ను విరచడాన్ని లక్ష్యంగా చేసుకున్న మండల్ ఉద్యమానికి లాలూప్రసాద్ యాదవ్ నాయకత్వం వహించారు. అయితే ముఖ్యమంత్రి పదవిని ఆయన రెండు పర్యాయాలు నిర్వహించిన తరువాత ఆ సామాజిక విప్లవం నిలిచిపోయింది. పరిపాలన పట్ల అశ్రద్ధ, శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో ఉదాసీనత, అధికారాన్ని ఒక కులం చుట్టూ కేంద్రీకృతం చేసి, కుటుంబ పాలన చేయడంతో లాలూ మూడో పర్యాయం పదవీ కాలం ముగించేనాటికి ప్రభుత్వం మారితీరవలసిన అనివార్యత ఏర్పడింది. సామాజికంగా వెనుకబడిన కులాల, ఆర్థికంగా వెనుకబడిన కులాల, మహా దళితుల మద్దతుతో అగ్ర కులాల ఆధిపత్యం మళ్లీ రాజ్యాధికారాన్ని సాధించుకున్నది. క్రింది స్థాయి సామాజిక శ్రేణులలో ఐక్యత యాదవ్%-% ముస్లిం సంకీర్ణంగా సంకోచించింది (ఇటీవలి కుల గణన ప్రకారం బిహార్ జనాభాలో యాదవులు 14.2శాతం కాగా ముస్లింలు 17.7శాతంగా ఉన్నారు). అగ్రకులాల/ వెనుకబడిన కులాల విభజన మధ్యలో నితీశ్ కుమార్ నిలబడ్డారు. తద్వారా బిహార్ రాజకీయాలలో ఒక కీలక నాయకుడుగా ఆయన ప్రభవించారు. సామాజిక విప్లవం తిరోగమనానికి ఆయన తోడ్పడ్డారు!ప్రస్తుత ఎన్నికలలో ప్రతిపక్ష కూటమి మహాఘట్‌బంధన్ తన సామాజిక సంకీర్ణాన్ని ముస్లిం–యాదవ్ సమీకరణ పరిధి నుంచి విస్తృతం చేసేందుకు ప్రయత్నించింది. మల్లాహ్ కులస్తులకు (బిహార్ జనాభాలో 2.6శాతం) ప్రాతినిధ్యం వహిస్తున్న ముఖేశ్ సహానీ నాయకత్వంలోని వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీనిబీ చౌరాసియా, బరాయీ, తంబోలి సామాజిక వర్గాలకు (బిహార్ జనాభాలో 1.7శాతం) ప్రాతినిధ్యం వహిస్తున్న ఐపీ గుప్తా నేతృత్వంలోని ఇండియన్ ఇన్ క్లూజివ్ పార్టీ (ఐఐపీ)కి మహాఘట్ బంధన్‌లో స్థానం కల్పించారు. బిహార్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడుగా రవిదాసి వర్గానికి (బిహార్ జనాభాలో 5.6 శాతం) చెందిన నాయకుడిని నియమించడం ద్వారా కోల్పోయిన దళిత్ ఓటర్ల మద్దతు కూడగట్టుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. ముస్లిం ఓటర్లను సంఘటితపరచడం ద్వారా లబ్ధి పొందేందుకు కూడా ప్రతిపక్ష కూటమి ప్రయత్నిస్తోంది. అయితే ఈ ప్రయత్నాల ద్వారా గత లోక్‌సభ ఎన్నికలలో ఎన్డీఏకు లభించిన 8శాతం ఓట్ల ఆధిక్యాన్ని తగ్గించటం లేదా స్వాయత్తం చేసుకోవటంలో మహాఘట్‌బంధన్ సఫలమవుతుందా అనేది వేచి చూడాలి. ఇక నిలిచిపోయిన రెండో పరివర్తన సుశాసన్ (సుపరిపాలన). అభివృద్ధి సాధనలో నాణ్యమైన ఫలితాలను సాధించవలసిన అవసరం మరే రాష్ట్రంలో కంటే బిహార్‌లోనే అత్యధికంగా ఉన్నది. నితీశ్‌కుమార్ మొదటిసారి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సుపరిపాలనకు శ్రీకారం చుట్టారు. పలు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను నిర్విఘ్నంగా అమలుపరిచారు. రహదారుల నాణ్యతలో గణనీయమైన మెరుగుదలను సాధించారు. అయితే ఆ సుపరిపాలనా వెలుగులు ఎంతో కాలం నిలవలేదు. మసకబారిపోయాయి. ప్రజల మద్దతును నిలుపుకునేందుకు నితీశ్ ప్రభుత్వం అనేక గిమ్మిక్‌లు చేసింది. ప్రజల మద్దతును నిలబెట్టుకోగలిగింది గానీ సుపరిపాలనను కొనసాగించడంలో విఫలమయింది. నితీశ్ ప్రభుత్వం పదిహేను సంవత్సరాల క్రితం మంచిరోడ్లను నిర్మించిన విషయాన్ని బిహారీలు ఇప్పటికీ గుర్తు చేసుకొంటున్నారు. నితీశ్ రాక ముందు అన్నీ గతుకుల రోడ్లే కదా అని ఒక వృద్ధుడు వ్యాఖ్యానించాడు. నితీశ్ ప్రభుత్వం మద్యపానాన్ని నిషేధించింది. అయితే దీనికి ప్రజల మద్దతు సంపూర్ణంగా లభించలేదు. కల్తీ మద్యం విక్రయాలు పెరిగిపోయాయి. ఆ కల్తీ మద్యంతో సంభవిస్తున్న మరణాల సంఖ్య పెరిగిపోతూనే ఉన్నది. దీనికి తోడు మాదకద్రవ్యాల బెడద పెచ్చరిల్లింది. లాలూప్రసాద్ యాదవ్ పాలన 'జంగిల్‌రాజ్' అన్న అపప్రథ నితీశ్ పాలన కొనసాగేందుకు ఊతమిస్తోంది. అయితే ఆ జంగిల్‌రాజ్ అన్న నింద పాక్షికంగా మాత్రమే సత్యం.

# బయ్యారంలో శివనామస్మరణతో కార్తీక పౌర్ణమి వేడుకలు



**బయ్యారం,తోవ్వ,నవంబర్ 5**
బయ్యారం మండల కేంద్రంలో కోదండరామ దేవాలయంలో కార్తీక మాసంలో పవిత్రమైన రోజు కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.తెల్లవారుజామున నుండి భక్తులు అధికసంఖ్యలో రామాలయంలో దీపాలు వెలిగించారు.

దీంతో ఉదయం నుండి బయ్యారం మండల వ్యాప్తంగా కార్తీక పౌర్ణమి శోభ సంతరించుకుంది. మండల కేంద్రంలో కార్తీక పౌర్ణమీ వేడుకలు ఆలయ ప్రధాన అర్చకులు సుదర్శన చార్యులు ఆధ్వర్యంలో ఆలయంలో వైభవంగా కార్తీక పౌర్ణమి వేడుకలను నిర్వహించారు. తెల్లవారుజాము నుండి ప్రత్యేక పూజలు అభిషేకాలు చేసి శివనామస్మరణతో కార్తీక పౌర్ణమి రోజు ప్రత్యేక పూజలు చేశారు.ఈ పూజ కార్యక్రమంలో వైఎస్ రెడ్డి,పెద్దినేని వెంకటేశ్వరావు,సత్తి బాబు, తదితరులు పాల్గొన్నారు.

# జూబ్లిహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించిన క్రైస్తవ సంఘాలు : రేవంత్‌తో భేటీ



**హైదరాబాద్, నవంబర్ 5**
క్రైస్తవ సంఘాల ప్రతినిధులు బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలను వివరించారు. కమ్యూనిటీలో ఉన్న ఇబ్బందులను శాసన, పరిపాలనా స్థాయిలో పరిశీలించి పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్లు రేవంత్ వారికి హామీ ఇచ్చారు. ఆత్మవిశ్వాసంతో కూడిన ఈ సమావేశం సానుకూల వాతావరణంలో సాగింది. జూబ్లిహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించినందుకు సంఘాల నాయకులకు రేవంత్ కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో అన్ని మైనారిటీ వర్గాలకు సమాన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ విధానమని రేవంత్ స్పష్టం చేశారు. విద్య, ఉపాధి, భద్రత, ఆర్థిక బలోపేతం వంటి రంగాల్లో క్రైస్తవ మైనారిటీల కోసం కొత్త పథకాలను రూపుదిద్దుతున్నట్లు ఆయన తెలిపినట్లు తెలిసింది. ప్రజా సమస్యలు అధికారులకు చేరేలా ఒక ప్రత్యేక లియాజోన్ మెకానిజం ఏర్పాటు చేయాలనే అంశం కూడా సమావేశంలో చర్చకు వచ్చినట్లు వర్గాలు సూచిస్తున్నాయి. క్రైస్తవ సంఘాల మద్దతుతో జూబ్లిహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పట్టు మరింత బలోపేతం అవుతుందనే అభిప్రాయం పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది. కమ్యూనిటీ ఓటు పాకేజీలో కీలక పాత్ర పోషించే ఈ మద్దతు, ఎన్నికలపై ప్రభావం చూపుతుందనే విశ్లేషణ వినిపిస్తోంది. కాంగ్రెస్ ప్రతినిధులు కమ్యూనిటీతో నేరుగా జరిపిన ఈ సంప్రదింపులు, మైనారిటీ ఓటు సమీకరణలో పార్టీకి ప్లస్‌గా మారవచ్చని భావిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి పన్నం ప్రభాకర్, మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యేలు లక్ష్మీకాంతరావు, గణేష్, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ ఛైర్మన్ దీపక్ జాన్, ఏఐసీసీ మైనారిటీ విభాగం జాతీయ ఉపాధ్యక్షుడు అనీల్ థామస్ తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ కార్యాలయంపై దాడి హేయమైన చర్య

**ఖబర్దార్ కాంగ్రెస్ గుండాల్లారా....!!**

**రాష్ట్రంలో నడుస్తున్నది ప్రజాపాలన కాదు రాక్షస పాలన..!!**



**బయ్యారం,తోవ్వ,నవంబర్ 5**
మణుగూరు బిఆర్ఎస్ కార్యాలయంపై దాడి చేసి సామాగ్రిని తగలబెట్టి బిఆర్ఎస్ కార్యకర్తలను తీవ్రంగా గాయపరిచిన కాంగ్రెస్ గుండాలను వెంటనే అరెస్టు చేసి వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని బిఆర్ఎస్ బయ్యారం టౌన్ యూత్ అధ్యక్షులు కీర్తి ఉదయ్ అన్నారు.ప్రజాస్వామ్యంలో దమ్ముంటే రాజకీయంగా ఎదుర్కోవాలే తప్ప,ఇలాంటి నీతిమాలిన చర్యలు మానుకోవాలని,రేగ కాంతారావును రాజకీయంగా ఎదుర్కోలేని దమ్ము లేని నాయకులు ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతూ బిఆర్ఎస్ కార్యకర్తలను భయభ్రాంతులను చేయాలనుకుంటే ఒక్కొక్క బిఆర్ఎస్ కార్యకర్త అగ్గి కాగడాల మారి ఈ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని భూస్థాపితం చేస్తామని బిఆర్ఎస్ బయ్యారం టౌన్ యూత్ అధ్యక్షులు కీర్తి ఉదయ్ తో పాటు నీలారపు సంపత్ యాదవ్ ఈ కార్యక్రమంలో పాల్గొని హెచ్చరించారు.

# మూల మధుకర్ రెడ్డి మా పార్టీపై చేసిన తప్పుడు ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నాం

**-సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ,జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య.**

**బయ్యారం,తోవ్వ,నవంబర్ 5**
బయ్యారం సోసైటీ మాజీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు మూల మధుకర్ రెడ్డి ప్రెస్ మీట్ పెట్టి మా పార్టీ పై తప్పుడు ఆరోపణలు చేయటానికి తీవ్రంగా ఖండిస్తున్నామని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య బుధవారం తెలిపారు. గడ్డం వెంకట్రామయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బయ్యారం మండల కేంద్రంలో తనపై హత్యా ప్రయత్నం చేసిన వారిపై పోలీసులు చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నాయిని శ్రీనివాస్ రెడ్డి నిరసన రిలే నిరాహార దీక్ష చేస్తుంటే ఆయనకు సంఘీభావం తెలియజేస్తే మా పార్టీ పైన,ప్రతిపక్ష పార్టీల పైన అనేక తప్పుడు విమర్శలు చేయడం తగదని,మా పార్టీపై తప్పుడు విమర్శలు మానుకోవాలని వారు మధుకర్ రెడ్డికి సూచించారు. ముఖ్యంగా మా పార్టీ ఎర్ర భూస్వాముల పార్టీగా పేర్కొనడం దుర్మార్గమని,ఎక్కడ మా పార్టీ నాయకులు వందల ఎకరాలు కలిగి ఉన్నారో చెప్పాలని వారు డిమాండ్ చేశారు.ఉప్పలపాడులో కాంగ్రెస్ పార్టీ దొరలకు వ్యతిరేకంగా పోరాడి వారి ఆక్రమణలో వున్న ప్రభుత్వ భూములను ప్రజలకు పంచిపెట్టిన చరిత్ర మా పార్టీదని అన్నారు.దొరలకు వ్యతిరేకంగా పోరాడిన మా కార్యకర్త గుగులోత్ దేవ్లాను దారుణంగా హత్య చేసిన చరిత్ర మీదేనన్నారు.ఎకరం భూమి కూడా ఆశించకుండా వేల ఎకరాల పోడు భూములను పంచిన చరిత్ర, ఆ




పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని పోరాటం చేసి ప్రాణాలర్పించిన ఘనమైన చరిత్ర మా పార్టీకి ఉందని అన్నారు.పోడు భూములకు నేనే పట్టాలిప్పించానని మధుకర్ రెడ్డి చెప్పటం చాలా విడ్డురంగా ఉందని అన్నారు. ఎంతోమంది మా పార్టీ నాయకులు,కార్యకర్తల రక్తర్పణ చేసి పోడు భూములు సాధించి పెట్టారని, మా పార్టీ పోరాట ఫలితంగానే ఆ మాత్రం పేద,ఆదివాసి ప్రజలు పట్టాలు పొంది నాలుగు మెతుకులు తింటున్నారని,వారి పిల్లలను చదివించుకుంటున్నారని వారు అన్నారు.అంతేకానీ మధుకర్ రెడ్డి ఉన్న పార్టీ అధికారంలో ఉన్నప్పుడే వేలాది ఎకరాల పోడు భూములు బలవంతంగా రైతుల నుండి గుంజుకుంటున్నప్పుడు నోరు మెదపని నువ్వు,పోరాటం చేసి పోడు భూములు పట్టాలు సాధించుకుంటే,అది తొమ్మిదేండ్ల తర్వాత చివరి దశలో కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన పోడు పట్టాలను కాంగ్రెస్ నాయకుడు తన ఖాతాలో వేసుకొని నేనే పట్టాలు ఇప్పించానని మాట్లాడటంవిడ్డూరంగా వుందన్నారు.. చిత్తశుద్ధి గురించి మూల మధుకర్ రెడ్డి మాట్లాడటం అంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని,మూల మధుకర్ రెడ్డి చిత్తశుద్ధి ఏంటో, మా పార్టీ చిత్తశుద్ధి ఏంటో బయ్యారం మండల ప్రజలందరికీ తెలుసని, చిత్తశుద్ధి గురించి,ప్రజాస్వామ్యం గురించి మధుకర్ రెడ్డి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. ఇకపై మా పార్టీపై, మా పార్టీ నాయకత్వంపై చౌకబారు విమర్శలు మానుకోవాలని హితవు పలికారు. ఈ సమావేశంలో తుడుం వీరభద్రం,ఏపూరి వీరభద్రం,నేతకాని రాకేష్, యాకూబ్ పాష,కొదుమూరి నాగేశ్వరరావు,దొడ్డి తిరుమలేష్, ధరావత్ మంగీలాల్,వీరబోయిన ఐలయ్య,ఏనుగుల మురలళీ,కూనూరి యుగంధర్,రెడ్డిమల్ల విశ్వనాధం, పొన్నం శ్రీను,సోమారపు సుధాకర్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

# అమరవీరుల సంస్మరణ సభను జయప్రదం చేయాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ



**బయ్యారం,తోవ్వ,నవంబర్ 5**
అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా నవంబర్ 6 న బయ్యారంలో జరిగే సంస్కరణ సభను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం బయ్యారం మండల కేంద్రంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ పార్టీ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ గౌని ఐలయ్య మాట్లాడుతూ భూమికోసం,భుక్తి కోసం, పేద ప్రజల విముక్తి కోసం ఈ దేశంలో అసమానతలు పోవాలని నాక్సల్బరి శ్రీకాకుళ రైతాంగ సాయుధ పోరాటం, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం, గోదావరి లోయ ప్రతిఘటన పోరాటాలను ఎంతోమంది తమ అమూల్యమైన ప్రాణాలను అర్పించారని ఆయన అన్నారు. దేశానికి స్వాతంత్రం వచ్చి 76 సంవత్సరాలు నిండాయి. కానీ పేద ప్రజల బ్రతుకులు ఇంకా పేదవారిగానే బ్రతుకుతున్న స్థితి ఉంది.పాలకుల విధానాల వల్ల కోటీశ్వరులకు దేశ సంపద దోచిపెడుతున్నారు.ఇలాంటి అసమానతలు పోవాలని లక్ష్యంతో 1969 విప్లవ కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించింది.నాటి నుండి నేటి వరకు ప్రజల కోసం రాజ్య హింస, మాఫియా ముఠా చేతిలో అనారోగ్యంతో అమరత్వం పొందారనీ ఆయన అన్నారు.వారి ఆశయాలను మునుముందుకు తీసుకుపోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తుడుం వీరభద్రం, నేతకాని రాకేష్,ఏపూరి వీరభద్రం,యాకూబ్ పాషా, మంగీలాల్, కొదుమూరి నాగేశ్వరరావు, యుగంధర్, ఐలయ్య,మునీందర్,శేషు, మురళి, సుధాకర్,శ్రీను,వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

# నేరచరిత్ర కలిగిన ఎంఈఓను డిస్మిస్ చేయాలి


- ఎంఈఓ పై డిఇఓ కు ఫిర్యాదు చేసిన డిఎస్ఎఫ్ఐ
- డబ్బులు ఇచ్చి అధికారులను మేనేజ్ చేస్తుండు - పేదల భూములను లాక్కున్న ఘనుడు,
- అక్రమ బియ్యం వ్యాపారాలు చేసే మొనగాడు, - ఎంఈఓ కు మెండుగా పోలీసుల అండ
- డి ఎస్ ఎఫ్ ఐ రాష్ట్ర కార్యదర్శి సాయికుమార్, కోశాధికారి గుగులోతు సూర్యప్రకాష్

**తొవ్వ న్యూస్ ప్రతినిధి, కురవి నవంబర్ 5,**
పేదల భూములు లాక్కున్న ఘనుడు నేర చరిత్ర కలిగిన ఎంఈఓ ను ప్రభుత్వ ఉద్యోగం నుండి డిస్మిస్ చేయాలని డి ఎస్ ఎఫ్ ఐ రాష్ట్ర కార్యదర్శి సాయికుమార్, కోశాధికారి గుగులోతు సూర్యప్రకాష్ డిమాండ్ చేశారు. బుధవారం డి ఈ ఓ కు వినతి పత్రం ఇచ్చిన అనంతరం వారు మాట్లాడుతూ నేరచరిత్ర గలిగిన ఎంఈఓ ను ప్రభుత్వ ఉద్యోగం నుండి వెంటనే డిస్మిస్ చేయాలని డీఈఓ ను కోరినట్లు తెలిపారు. ఎంఈఓ పై అన్ని ఆధారాలతో డి ఈ ఓ కు సమర్పించినట్లు పేర్కొన్నారు. డిఎస్ఎఫ్ఐ నాయకులు ఇచ్చిన ఆధారాలను పరిశీలించి డిపార్ట్ పరంగా చర్యలు తీసుకుంటానని వారికి హామీ ఇచ్చినట్లు తెలిపారు. నేర చరిత్ర అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న సీరోలు ఎంఈఓ లచ్చీరంపై తక్షణమే చర్యలు తీసుకొని సర్వీస్ నుంచి తొలగించి అరెస్టు చేయించాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి చెందిన పిడిఎఫ్




బియ్యం అమ్ముకున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. సామాన్యులు తప్పు చేస్తే బేడిలు వేసి జైలు పంపడానికి పోలీసులు అత్యుత్సాహం చూపిస్తారు, అన్ని ఆధారాలు చూపెట్టి ఎంఈఓ ను అరెస్టు చేయమంటే పోలీసులు చోద్యం చూస్తున్నారని అన్నారు. పేద ప్రజలు తప్పు చేస్తే వెంటనే బేడీలు వేసి జైలుకు పంపిస్తారని ఎంఈఓ చేసిన తప్పులను ఆధారాలతో చూపిస్తే ఎందుకు వెనకడుగు వేస్తున్నారని పోలీసులను ప్రశ్నిస్తున్నారు. ఎంఈఓ లచ్చిరాం చేసిన అవినీతి కార్యకలాపాలు స్పష్టంగా ఉన్నప్పటికీ పోలీసు అధికారులు ఎందుకు చర్య తీసుకోవడం లేదు సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేశారు. చదువు నేర్పే గురువులు నేరచరిత్ర కలిగి ఉంటే విద్యార్థులు కూడా అదే దారిలో నడుస్తారని అలాంటి నేరచరిత్ర కలిగిన ఎంఈఓ ను వెంటనే డిస్మిస్ చేయాలని సర్వీస్ నుంచి రిమూవ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఉపాధ్యాయులు ఉంటే విద్యార్థుల భవిష్యత్తు అగమ్య గోచరంగా ఉంటుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. త్వరలో విద్యాశాఖ కార్యదర్శి, విద్యాశాఖ మంత్రివర్యులకు వినతిపత్రం ఇస్తామని తెలిపారు. డిఇఓ కు వింత పత్రం అందించిన వారు జిల్లా ఇన్చార్జ్ శ్రీకాంత్. వేణు. తదితరులు ఉన్నారు.

# మాజీ మంత్రి హరీష్ రావుకు బానోత్ హరిప్రియ హరిసింగ్ నాయక్ దంపతుల పరామర్శ



**బయ్యారం,తోవ్వ,నవంబర్ 5**
తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి,సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ గత కొద్దిరోజుల క్రితం కన్నుమూశారని తెలిసిందే.ఈ నేపథ్యంలో ఇల్లందు నియోజకవర్గ మాజీ శాసనసభ్యురాలు బానోత్ హరిప్రియ హరిసింగ్ నాయక్ దంపతులు బుధవారం హైదరాబాదులోని మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు స్వగృహానికి వెళ్లి వారిని పరామర్శించి హరీష్ రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు.పరామర్శించిన వారిలో బయ్యారం మండల అధ్యక్షులు తాత గణేష్,ఉపాధ్యక్షులు బానోత్ మురళి కృష్ణ,గంట రాము,రాయల రాజేష్,ఇర్ప రాజేష్ ఉన్నారు.

# సినిమా

## మగాళ్లకి కూడా పీరియడ్స్ వస్తే బాగుండు.. రష్మిక కీలక వ్యాఖ్యలు



ఈ ఏడాది ఇండియన్ సినీ పరిశ్రమలో రష్మిక మందన్నా సందడి ఎక్కువగా కనిపిస్తోంది. నెల, రెండు నెలల గ్యాప్‌లో ఓ సినిమా విడుదల చేస్తూ ప్రేక్షకులను అలరిస్తోంది. ఇప్పటివరకు ఆమె నటించిన నాలుగు సినిమాలు థియేటర్లలో విడుదలై మంచి విజయాన్ని సాధించాయి. గత ఏడాది డిసెంబర్‌లో విడుదలైన 'పుష్ప 2' తో రష్మిక తన సత్తా చాటుకోగా, ఈ ఏడాది 'ఛావా', 'సికందర్', 'కుబేర', 'థామా' చిత్రాలతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇప్పుడు రష్మిక నటించిన తాజా చిత్రం 'ది గర్ల్ ఫ్రెండ్' ఈ నెల 7న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో రష్మిక పలు ప్రమోషనల్ కార్యక్రమాల్లో బిజీగా ఉంది. షోలు, ఇంటర్వ్యూలలో పాల్గొంటూ అభిమానులను అలరిస్తోంది. తాజాగా ఆమె జగపతిబాబు హోస్ట్‌గా రన్ అవుతున్న 'జయమ్ము నిశ్చయమ్మురా' టాక్ షోలో పాల్గొని సందడి చేసింది. ఈ సందర్భంగా రష్మిక తన చిన్ననాటి అనుభవాలను పంచుకుంటూ, స్కూల్ రోజుల్లో జరిగిన ఒక సంఘటనను గుర్తుచేసింది. జగపతిబాబు అడిగిన ప్రశ్నలకు రష్మిక ఇచ్చిన సరదా సమాధానాలు ప్రేక్షకులను అలరించాయి. అంతేకాకుండా, షోలో రష్మిక మహిళలకు సంబంధించిన సమస్యలపై మాట్లాడింది. "మగాళ్లకు కూడా పీరియడ్స్ వస్తే బాగుండని అనిపించింది. ఆ సమయంలో మహిళలు ఎదుర్కొనే నొప్పి, బాధ ఎలా ఉంటుందో అబ్బాయిలు కూడా అనుభవిస్తే వారికి అర్థం అవుతుందని చెప్పి అందర్నీ ఆకట్టుకుంది. ఆమె మాటలకు జగపతిబాబు, ఆడియెన్స్ ఇద్దరూ చప్పట్లు కొట్టారు. ఇక రష్మిక నటించిన 'ది గర్ల్ ఫ్రెండ్' ఒక ఇంటెన్స్ లవ్ స్టోరీగా తెరకెక్కింది. దీక్షిత్ శెట్టి హీరోగా నటించిన ఈ చిత్రానికి రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహించగా, ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మాతలుగా వ్యవహరించారు. గీతా ఆర్ట్స్ సమర్పణలో రూపొందిన ఈ చిత్రంలో ప్రేమకథలోని కొత్త కోణాన్ని చూపించబోతున్నట్లు దర్శకుడు తెలిపారు. ఈ సినిమా చూసిన తర్వాత అమ్మాయిలు తమ లవర్స్ గురించి ఆలోచించేలా ఉంటుందని ఆయన చెప్పడం విశేషం. ప్రస్తుతం రష్మిక మందన్నా 'మైసా' అనే లేడీ ఓరియెంటెడ్ మూవీలో నటిస్తోంది. అదనంగా బాలీవుడ్‌లో ఒక కొత్త ప్రాజెక్ట్‌లోనూ భాగమవుతోంది. అంతేకాకుండా విజయ్ దేవరకొండతో కలిసి రాహుల్ సాంక్రిత్యాన్ దర్శకత్వంలో ఒక పీరియాడిక్ యాక్షన్ ఎంటర్టైనర్‌లో నటిస్తోంది. పలు క్రేజీ ప్రాజెక్టులపై చర్చలు కొనసాగుతున్నాయని సినీ వర్గాల సమాచారం.

## మీ అందరికి చేతులెత్తి దండం పెడుతున్నా..

### నన్ను ఇబ్బంది పెట్టొద్దంటున్న బండ్ల గణేష్

టాలీవుడ్ నటుడు, నిర్మాత బండ్ల గణేష్ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. ఒకప్పుడు కమెడియన్‌గా సినిమాల్లో గుర్తింపు తెచ్చుకున్న ఆయన, తర్వాత నిర్మాతగా మారి తన ప్రతిభను నిరూపించుకున్నారు. పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన గబ్బర్ సింగ్ బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలవడంతో, బండ్ల గణేష్ స్టార్ ప్రొడ్యూసర్‌ల జాబితాలో చేరిపోయారు. ఆ తర్వాత కూడా ఆయన ఎన్నో భారీ ప్రాజెక్టులకు రూపకల్పన చేశారు. అయితే జూనియర్ ఎన్టీఆర్ తో చేసిన టెంపర్ తర్వాత సినిమాల నుండి కొంత విరామం తీసుకొని రాజకీయ రంగంలోకి అడుగుపెట్టారు.

తాజాగా బండ్ల గణేష్ యంగ్ హీరో కిరణ్ అబ్బవరం హీరోగా నటించిన కే ర్యాంప్ సినిమా సక్సెస్ మీట్‌లో పాల్గొన్నారు. అక్కడ ఆయన కిరణ్ అబ్బవరంని పొగడ్తలతో ముంచెత్తుతూ, "ఇక నిన్ను ఎవరు ఆపలేరు" అని ప్రకటించారు. అదే సమయంలో "నేను బ్లాక్‌బస్టర్ సినిమా తర్వాత సినిమాలు ఆపేశాను%ా% త్వరలోనే నిర్మాతగా తిరిగి వస్తాను" అని చెప్పడం సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అయింది. ఈ వ్యాఖ్యలతోనే సోషల్ మీడియాలో పలు రకాల వార్తలు వైరల్ అయ్యాయి. "బండ్ల గణేష్ మళ్లీ నిర్మాతగా రాబోతున్నాడు", "ఒక స్టార్ హీరో డేట్స్ ఇచ్చాడు" అంటూ ఊహాగానాలు చెలరేగాయి. కొన్ని మీడియా ప్లాట్‌ఫారమ్‌లు ఆయన కొత్త సినిమా పై ప్రీ ప్రొడక్షన్ ప్రారంభించారని కూడా రాసాయి. ఈ వార్తలు ఎక్కువ కావడంతో, బండ్ల గణేష్ స్వయంగా సోషల్ మీడియాలో స్పష్టత ఇచ్చారు. "మిత్రులకు, శ్రేయోభిలాషులకు నా హృదయపూర్వక విన్నపం. ప్రస్తుతం నేను ఏ సినిమాను నిర్మించడం లేదు. ఇంకా సినిమాలు చేయడం పై ఎలాంటి నిర్ణయం కూడా తీసుకోలేదు. కాబట్టి, ఇలాంటి వార్తలు రాసి నన్ను ఇబ్బంది పెట్టకండి. మీ ప్రేమ, మద్దతు ఎల్లప్పుడూ నాతోనే ఉండాలి. మీకు చేతులెత్తి నమస్కరిస్తూ%ా% విన్నవించుకుంటున్నా.ఇట్లు మీ బండ్ల గణేష్."అని తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఈ క్లారిటీతో బండ్ల గణేష్ మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అయ్యారు.

## బిగ్ బాస్ హౌజ్‌లో ఉద్రిక్త వాతావరణం..

### హౌజ్‌మేట్స్ ఇలా కొట్టుకున్నారేంటి?



ప్రస్తుతం 'బిగ్ బాస్' కార్యక్రమం తెలుగు, తమిళ్, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విజయవంతంగా సాగుతోంది. తెలుగులో మాదిరిగానే తమిళ్ బిగ్ బాస్ సీజన్ 9 కూడా రసవత్తరంగా కొనసాగుతోంది. ఇప్పటికే నెలరోజులు పూర్తి చేసుకున్న ఈ రియాలిటీ షోలో ప్రస్తుతం మొత్తం 20 మంది కంటెస్టెంట్లు ఉన్నారు. వీరిలో 15 మంది మొదటి నుంచే ఉన్నప్పటికీ, ఇటీవల వైల్డ్ కార్డ్ ఎంట్రీ ద్వారా మరో నలుగురు హౌస్‌లోకి అడుగు పెట్టారు. ప్రస్తుతం తమిళ్ బిగ్ బాస్ 9 ఐదో వారంలోకి ప్రవేశించింది. ఈ వారం నామినేషన్స్ హోరాహోరీగా జరిగాయి. వినోద్, వియానా, శబరి, విక్రమ్, పార్వతి, కమ్రుదిన్, ప్రవీణ్, కెమి, తుషార్, దివాకర్, రమ్య జో తదితరంగా మొత్తం 12 మంది నామినేట్ అయ్యారు. అయితే ఈ వారం హౌస్‌లో షాకింగ్ ఇన్సిడెంట్ చోటు చేసుకుంది. తాజాగా విడుదలైన ప్రోమోలో కంటెస్టెంట్లు కమ్రుదిన్, ప్రవీణ్ రాజ్ మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. మాటల యుద్ధంతో ప్రారంభమైన ఈ ఘర్షణ క్రమంగా కొట్టుకునే స్థాయికి చేరింది. ఒకరిపై ఒకరు అరుస్తూ, తోసుకుంటూ కనిపించిన ఈ దృశ్యాలు ప్రోమోలో స్పష్టంగా కనిపించాయి. ఇతర కంటెస్టెంట్లు వారిని ఆపడానికి ప్రయత్నించినప్పటికీ, పరిస్థితి అదుపులోకి రాలేదు. కొందరు మహిళా కంటెస్టెంట్స్ ఈ పరిస్థితి చూసి కన్నీళ్లు పెట్టుకున్నారు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇప్పుడు అందరి దృష్టి బిగ్ బాస్ రియాక్షన్‌పైనే ఉంది. అలాగే హోస్ట్ విజయ్ సేతుపతి ఈ ఘటనపై ఎలా స్పందిస్తారో చూడాలి. ఈ ఘర్షణ తర్వాత హౌస్‌లో పరిస్థితి ఎలా మారుతుందో అనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. అయితే ఇలాంటి పరిస్థితులు బిగ్ బాస్ చరిత్రలో జరగడం చాలా అరుదు. సాధారణంగా, బిగ్ బాస్ నిబంధనల ప్రకారం కంటెస్టెంట్లు ఒకరినొకరు భౌతికంగా తాకడానికి అనుమతి లేదు. అలాంటిది ఇలా దాడి చేసుకోవడం తీవ్రమైన ఉల్లంఘనగా పరిగణించబడుతుంది. అసలు ఇతర ఇంటి సభ్యులు వారిని కంట్రోల్ చేయకపోతే పరిస్థితి ఎక్కడి వరకు వెళ్లి ఉండేదో అని ఆలోచన చేస్తూ భయాందోళనకి గురవుతున్నారు.

## మంగళసూత్రంపై రాహుల్ చేసిన కామెంట్‌తో రెచ్చిపోతున్న నెటిజన్స్.. సినిమాపై ఎఫెక్ట్ పడుతుందా?



'అందాల రాక్షసి'తో హీరోగా ఎంట్రీ ఇచ్చి, ఆ తర్వాత దర్శకుడిగా మారిన రాహుల్ రవీంద్రన్ మరోసారి వార్తల్లో నిలిచాడు. ఆయన దర్శకత్వంలో నేషనల్ క్రష్ రష్మిక మందన్నా కథానాయికగా నటించిన 'ది గర్ల్‌ఫ్రెండ్' నవంబర్ 7న విడుదల కానుంది. సినిమా ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్న రాహుల్, ఈ సందర్భంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో తన భార్య చిన్మయి శ్రీపాద మంగళసూత్రం ధరించడంపై చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో తీవ్ర చర్చకు దారి తీశాయి. పెళ్లి తర్వాత మహిళలు తప్పనిసరిగా మంగళసూత్రం ధరించాలి అనే ఆచారం నేను సమర్థించను. అది పూర్తిగా నా భార్య చిన్మయి ఇష్టం. నేను ఎప్పుడూ ఆమెపై బలవంతం చేయలేదు. ఒక మహిళ మెడలో తాళి ఉంటేనే ఆమె పెళ్లయిందని ఎందుకు గుర్తించాలి? మగవాడికి అలాంటి గుర్తు ఉండదు కదా? ఇది లింగ వివక్షలోకి వస్తుంది. సమాన హక్కులు రావాలంటే ఇలాంటి పాత ఆచారాలను ప్రశ్నించాల్సిన అవసరం ఉంది," అన్నారు. అయితే ఆయన వ్యాఖ్యలు వైరల్ కావడంతో సోషల్ మీడియాలో తీవ్ర ప్రతిస్పందనలు వస్తున్నాయి. కొందరు నెటిజన్లు రాహుల్‌ను, చిన్మయిని తిట్టిపోస్తున్నారు. "నీ భార్య తాళి వేసుకోదు%ా% నువ్వు జంధ్యం వేసుకున్నావా?", "హిందూ సంప్రదాయాల్ని ఎందుకు అవమానిస్తున్నావు?", "మంగళసూత్రం వేసుకోకపోతే పెళ్లి ఎందుకు చేసుకున్నావు?" అంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అదే సమయంలో రాహుల్ అభిప్రాయాన్ని సమర్థించే వర్గం కూడా ఉంది. "ప్రతి ఒక్కరికీ తన ఆలోచన స్వేచ్ఛ ఉంది. రాహుల్ చెప్పింది తప్పేమీ కాదు. సమాజం మారాలంటే ఇలాంటి ఆలోచనలు అవసరం," అంటూ కొందరు నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు. ఇక చిన్మయి కూడా సోషల్ మీడియాలో తన భర్తకు మద్దతుగా ఘాటుగా స్పందించింది. ఒక నెటిజన్ "మంగళసూత్రం స్త్రీకి భద్రతను ఇస్తుంది" అని రాయగా, చిన్మయి కౌంటర్ ఇస్తూ, "మంగళసూత్రం మహిళలపై లైంగిక దాడులు, వేధింపులను ఆపలేదు. పుట్టిన శిశువులపైనా దారుణాలు జరుగుతున్నాయి. అప్పుడు ఒక మంగళసూత్రం ఎలా రక్షిస్తుంది?" అంటూ కౌంటర్ ఇచ్చింది. ఈ వ్యాఖ్యలతో రాహుల్–చిన్మయి దంపతులపై సోషల్ మీడియాలో చర్చ చెలరేగింది. కొందరు "సాంప్రదాయాలను తక్కువ చేసి చూపిస్తున్నారు" అంటుండగా, మరికొందరు "వాళ్లు చెప్పింది ఆలోచించాల్సిన విషయం" అని సమర్థిస్తున్నారు. అయితే ఈ వివాదం 'ది గర్ల్‌ఫ్రెండ్' సినిమా విడుదలకు కొన్ని రోజుల ముందే రావడంతో, సినిమాపై ఎఫెక్ట్ పడొచ్చని సినీ వర్గాలు చెబుతున్నాయి. సినిమా రిలీజ్ సమయంలో ఇలాంటి సున్నితమైన విషయాలపై వ్యాఖ్యలు చేయడం రిస్క్ అని, కొన్నిసార్లు అవి రిజల్ట్‌పై కూడా ప్రభావం చూపుతాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## మళ్లీ తెరపై బాహుబలి సంచలనం

### 'బాహుబలి: ది ఎటర్నల్ వార్'యానిమేషన్ టీజర్ అదుర్స్!

భారత సినీ చరిత్రలో సంచలనం సృష్టించిన 'బాహుబలి' సినిమాను ఎవరు అంత ఈజీగా మర్చిపోగలరు. దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో, ప్రభాస్ హీరోగా వచ్చిన మెగా విజువల్ వండర్ రెండు భాగాలుగా విడుదలై దేశవ్యాప్తంగా అపారమైన విజయాన్ని సాధించింది. ఇటీవల ఈ సినిమా రెండు భాగాలని ఒకే పార్ట్‌గా థియేటర్లలో రీ రిలీజ్ చేశారు. ఆశ్చర్యకరంగా రీ రిలీజ్‌లో కూడా బాహుబలి మ్యాజిక్ మరోసారి బాక్సాఫీస్ వద్ద కొనసాగింది.ఇదిలా ఉంటే, రాజమౌళి ముందుగానే ప్రకటించినట్టుగా 'బాహుబలి: ది ఎటర్నల్ వార్' అనే యానిమేషన్ సిరీస్‌పై ఆసక్తి నెలకొంది. రీ రిలీజ్ సందర్భంగా ఈ సిరీస్‌కి సంబంధించిన టీజర్‌ను కూడా ప్రదర్శించారు. ఇప్పుడు ఆ టీజర్‌ను అధికారికంగా విడుదల చేయడంతో అభిమానుల్లో హడావుడి మొదలైంది. టీజర్ రమ్యకృష్ణ (శివగామి) గంభీరమైన వాయిస్‌తో ప్రారంభమవుతుంది. "బాహుబలి మరణం ఒక ముగింపు కాదు%ా% అది ఒక మహా కార్యానికి ప్రారంభం%ా% తన గమ్యం యుద్ధం.".. ఈ ఒక్క డైలాగ్‌తోనే కథపై ఉత్కంఠ పెరిగిపోయింది. టీజర్‌లో బాహుబలి మరణం తరువాత అతని ఆత్మ పాతాళ లోకానికి వెళ్లడం, శివలింగం ముందు నృత్యం చేయడం, ఆకాశ లోకంలో దేవతలతో యుద్ధం చేయడం వంటి అద్భుతమైన విజువల్స్ చూపించారు. బాహుబలి కోసం ఇంద్రుడు %–% విశాసురుడు మధ్య జరిగే భీకర పోరాటం, చివరికి విశాసురుడు ఓడిపోవడం టీజర్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఆ యాక్షన్ సన్నివేశాలు, ఆధ్యాత్మిక టచ్, మైథాలజికల్ థీమ్ ు ఇవన్నీ కలగలిపి ఈ సిరీస్‌ను కొత్త స్థాయికి తీసుకెళ్లనున్నట్టు కనిపిస్తోంది. ఈ యానిమేషన్ సిరీస్‌ను ఇషాన్ శుక్లా దర్శకత్వం వహిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌కు ఎస్.ఎస్. రాజమౌళి సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం సిరీస్ పనులు వేగంగా జరుగుతున్నాయి. అద్భుతమైన విజువల్ టెక్నాలజీతో, అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ఈ ప్రాజెక్ట్ రూపొందుతోంది. 'బాహుబలి: ది ఎటర్నల్ వార్' 2027లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సిరీస్ అసలు బాహుబలి కథకు కొనసాగింపు కాకుండా, పూర్తిగా కొత్త విశ్వంలో సాగే ఆధ్యాత్మిక %–% ఫాంటసీ యాక్షన్ యానిమేషన్‌గా ఉండబోతోంది. టీజర్ విడుదలతోనే సోషల్ మీడియాలో ఫ్యాన్స్ ఉత్సాహంగా స్పందిస్తున్నారు. "యానిమేషన్ అదిరిపోయింది", "రాజమౌళి మరో విజువల్ వండర్‌కు శ్రీకారం చుట్టాడు", "బాహుబలి స్పిరిట్ ఇంకా బతికే ఉంది" అంటూ కామెంట్లు కురుస్తున్నాయి.

Published and printed by; MUKESH VEERANTI.TEL NO;T/TG/619.2024.Cell no ;9398236146.8328649322.gmail.Thovvanews@gmail.com Head office:THOVVA NEWS.#5-70/5/4. PLOT NO 36.SAI MAHADEV NAGAR.PARVATHAPUR.MEDIPALLI. FIZADHIGUDAMEDCHAL MALKAJGIRI..Pin.5000399398236146